నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
ఆదివారం, జనవరి 05 2025 పేజీలు 8
గుంటూరు పల్నాడు

# పులి vs డైమండ్



నువ్వెంత అంటే నువ్వెంత
భేషాజలతో పంతాలు....
ప్రజా సమస్యలను వదిలి పంతాలకు పోయిన ప్రజాప్రతినిధులు అధికారులు..
నిరవధికంగా వాయిదా పడిన కౌన్సిల్ సమావేశం



**గుంటూరు ప్రతినిధి మేజర్ న్యూస్:**
ప్రజాసేవకై ప్రజల ఓట్లతో గెలిచి వారి ప్రతినిధులుగా గుంటూరు నగర పాలక సంస్థలో వచ్చిన వారు కొందరు. ప్రభుత్వ ప్రతినిధులుగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూ నగరపాలక సంస్థకు వచ్చినవారు మరికొందరు. వీరందరి లక్ష్యం ఒక్కటే. ప్రజల ధనాన్ని దుర్వినియోగం కాకుండా చూడడం. మెరుగైన పరిపాలనతో ప్రజా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడం. ఇలా మంచి ఉన్నతమైన భావాలతో ప్రజాప్రతినిధులు అధికారులు కలిసికట్టుగా పనిచేయాల్సి ఉండగా శనివారం జరిగిన కౌన్సిల్ ఇందుకు విరుద్ధంగా మారింది. ప్రజాధనం దుర్వినియోగం అయిందని సరే నేను లెక్కలు కావాలని ప్రజాప్రతిని పట్టుబడితే... అడిగే విధానం పద్ధతి మార్చుకోవాలంటూ ఒకానొక దశలో అధికారులు తిరగబడ్డారు. ఇదేంటి తమాషాగా ఉందా.. సక్రమంగానే అడుగుతున్నాం అని ప్రజాప్రతినిధులు గొంతేత్తితే అధికారులు పట్టా పరుష పదజాలం వాడుతున్నారని అవమానకరంగా మాట్లాడుతున్నారంటూ అధికారులు మైక్ లు విసిరేసి సభను బహిష్కరించారు. అంతటా చోద్యం చూస్తున్న నగరపాలక సంస్థ మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు, ఎమ్మెల్సీలు లేళ్ల

మిగతా 3లో

# యువతను వ్యవసాయం వైపు ప్రోత్సహించాలి

- వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు
- వ్యవసాయంలో సరికొత్త టెక్నాలజీ రావాలి : విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య
- పంటను రెట్టింపు చేయాలి : విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు
- విజ్ఞాన్స్ వర్సిటీలో ఘనంగా అభ్యుదయ రైతుల పురస్కారాలు-2025

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**
ప్రస్తుతం వ్యవసాయం చేస్తున్న వారిని అన్ని విధాలుగా ప్రోత్సహిస్తేనే భవిష్యత్తులో మరింత మంది యువత వ్యవసాయం చేయడానికి ఆసక్తి చూపుతారని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు కింజరాపు

మిగతా 3లో



## అందులకు లిపి అందించిన జ్ఞాని బ్రెయిలీ

### బ్రెయిలీ జయంతి వేడుకల్లో పాల్గొన్న సన్

సర్ లూయిస్ బ్రెయిలీ తన 15వ ఏటనే అంధులకు ఎంతో ఉపయోగ పడే విధంగా బ్రెయిలీ లిపిని అందించిన గొప్ప జ్ఞాని అని జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ తెలిపారు.

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**
శనివారం స్థానిక బృందావన్ గార్డెన్ లోని విభిన్న ప్రతిభావంతుల వసతి గృహ ఆవరణలో జరిగిన సర్ లూయిస్ బ్రెయిలీ 216వ జయంతి వేడుకలలో

మిగతా 2లో



## పేద ఇంటర్ విద్యార్థులకు ఆకలి తీర్చే మధ్యాహ్నం భోజనం

- గుంటూరు మహిళా కళాశాలలో భోజనం ప్రారంభం
- పాల్గొన్న ఎమ్మెల్యే నసీర్, కలెక్టర్ నాగలక్ష్మి

స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి, గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహమ్మద్ నజీర్ అహ్మద్ తో కలిసి లాంఛనంగా ప్రారంభించారు.

**గుంటూరు జిల్లా నేటి దినపత్రిక సూర్య బ్యూరో**
శనివారం స్థానిక నాజ్ సెంటర్ వద్ద గల ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకాన్ని జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి , గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహమ్మద్ నజీర్ అహ్మద్ ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్వయంగా భోజనం వడ్డించి వారితో కలిసి భోజనం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఎస్. నాగలక్ష్మి



మిగతా 2లో

## అన్ని వర్గాల ప్రజలను అలరిస్తున్న నేటి దినపత్రిక సూర్య



"నేటి దినపత్రిక సూర్య " నిష్పక్షపాతంగా వార్తలు ప్రచురిస్తూ సమాజంలో ఉన్న అన్ని వర్గాల వారిని అలరిస్తోందని గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అన్నారు శనివారం రాత్రి కార్పొరేషన్ కార్యాలయంలో న్యూ ఇయర్.2025 సందర్భంగా నేటి దినపత్రిక సూర్య ప్రచురించిన రెండు ఆకర్షణీయమైన క్యాలెండర్లను ఆయన ఆవిష్కరించారు. ఉమ్మడి గుంటూరు జిల్లా బ్యూరో ఇంచార్జ్ పి బాలు (చిన కొండయ్య) ఆదేశాల మేరకు ఈ కార్యక్రమంలో జిల్లా ఇన్చార్జ్ గట్టుపల్లి శ్రీనివాసరావు, స్టాఫ్ రిపోర్టర్ ఆర్. ధావుర్య నాయక్ (సూర్య ఆర్.డి) తదితరులు పాల్గొన్నారు. - గుంటూరు జిల్లా , నేటి దినపత్రిక సూర్య బ్యూరో



## అందులకు లిపి అందించిన జ్ఞాని బ్రెయిలీ

### (మొదటి పేజీ తరువాయి)

జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ , తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు ఎండీ నసీర్ అహ్మద్, పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు గళ్లా మాధవి తో కలసి పాల్గొన్నారు. తొలుత ఆవరణలోని సర్ లూయిస్ బ్రెయిలీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళు లర్పించారు. అనంతరం సర్ లూయిస్ బ్రెయిలీ జయంతిని పురస్కరించుకొని కేక్ కట్ చేయటం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ ఏ భార్గవ్ తేజ మాట్లాడుతూ అంధులు విద్యను అభ్యసించేందుకు వీలుగా కేవలం ఆరు చుక్కలతో వారు రూపొందించిన లిపి ప్రపంచంలో ఒక గొప్ప ఆవిష్కరణ అన్నారు. ఇంతటి ఉన్నతమైన పనిని వారు తన 15వ ఏటనే రూపొందించటం ఒక గొప్ప కార్యక్రమం అన్నారు. సర్ లూయిస్ బ్రెయిలీ తన లిపి ద్వారా జ్ఞానాన్ని ప్రపంచానికి పంచగలిగాలరన్నారు. వారు అందించిన ఈ జ్ఞానాన్ని అందిపుచ్చుకొని ముందుకు సాగాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున అంధులకు అనేక సహాయ సహకారాలు అందించటం జరుగుతున్నదని తెలిపారు. 2014 సంవత్సరం నుంచి ఇప్పటి వరకు 758 ల్యాప్ టాప్ లు అందించటం జరిగిందని, 137 మంది విజువల్లీ హ్యాండీక్యాప్ లకు ఉద్యోగ అవకాశాలు కల్పించటం జరిగిందని తెలిపారు. ప్రభుత్వం తరుపున మరిన్ని సహాయ సహకారాలు అందించటం జరుగుతుందని తెలిపారు.

తూర్పు నియోజకవర్గ శాసనసభ్యులు ఎండీ నసీర్ అహ్మద్ మాట్లాడుతూ అంధులకు అన్ని సహాయ సహకారాలు అందించి వారి అభ్యున్నతికి తోడ్పాటుగా ఉంటామన్నారు. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గళ్లా మాధవి మాట్లాడుతూ అంధులకు అన్ని విషయాలలో తోడ్పాటుగా ఉంటామని అలాగే లూయిస్ బ్రెయిలీ విగ్రహ ప్రతిష్టాపనకు అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. క్రికెట్ కిట్ లను అంధులైన విద్యార్థులకు అందించటం జరిగింది. అంధుల వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ అంధుల శ్రేయస్సు కొరకు కల్పించిన సౌకర్యాలను వారికే వినియోగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. గుంటూరు పట్టణంలో సర్ లూయిస్ బ్రెయిలీ విగ్రహ ప్రతిష్టాపనకు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అలాగే మున్సిపల్ కాంప్లెక్స్ లలో షాపులు కేటాయించి తోడ్పాటు అందించాలని కోరారు. ఆర్టీసీ బస్సులలో అంధులకు కేటాయించిన సీట్లలో వారినే కూర్చునే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే హౌసింగ్ అలాట్మెంటలలో ,టిడ్కోలలో అంధులకు గృహ వసతి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ సువార్త, కార్పోరేటర్ పద్మ, విజువల్లీ చాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు కొలగాని శ్రీనివాసరావు, విజువల్లీ చాలెంజ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ నుండి యామిని నరసింహారావు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఇండియా అధ్యక్షులు పి కృష్ణారెడ్డి, విజువల్లీ యూత్ అసోసియేషన్ అధ్యక్షులు జయరాజ్, సంఘ సేవకులు పిల్లి అంకమ్మరావు, హెలెన్ కెల్లన్ వెల్ఫేర్ ఆఫ్ ది బ్లైండ్ పివీఎస్ నాగేశ్వరరావు, నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ది బ్లైండ్ ఇండియా జాయింట్ సెక్రటరీ గుళ్ళపల్లి జాన్ సైదా, కళాభారతి స్కూల్ ఆఫ్ ది బ్లైండ్ సెక్రటరీ రవీంద్రరెడ్డి, కన్నా మాస్టర్, టీడీపీ వాణిజ్య విభాగ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి పొదలి వాసు, కో ఆర్డినేటర్ సబ్బినేని శ్రీధర్, కార్యనిర్వాహక కార్యదర్శి కసుమర్తి హనుమంతరావు, బోయపాటి చారిటీబల్ ట్రస్ట్ ట్రస్టీ సాంబశివరావు, బ్లైండ్ స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

## పేద ఇంటర్ విద్యార్థులకు ఆకలి తీర్చే మధ్యాహ్నం భోజనం

### (మొదటి పేజీ తరువాయి)

మాట్లాడుతూ జిల్లాలోని ఐదు కళాశాలల్లో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. మూడు కళాశాలల్లో అక్షయ పాత్ర వారు భోజనం సరఫరా చేస్తారని , రెండు కళాశాలల్లో బడిలో మధ్యాహ్న భోజనం వండే ఏజెన్సీలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ పథకంలో విద్యార్థులకు ప్లేట్లు , గ్లాసులు ప్రభుత్వమే సమకూరుస్తుందన్నారు. విద్యా శాఖ విద్యార్థుల బుణాత్మక విద్యను వృద్ధి చేయుటకు జూనియర్ కళాశాలల్లో పని గంటలు పెంపు చేయడం జరిగిందన్నారు. విద్యార్థుల కోసం సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యా మిత్ర ద్వారా దారిద్ర్య రేఖకు దిగువన వున్న విద్యార్థుల విద్యా పనితీరును పెంపొందించడానికి విద్యా కిట్లను అందజేయడం జరిగిందన్నారు. అలాగే కస్తూరీబా గాంధీ బాలికల విద్యాలయాలు , ఏ.పి మోడల్ స్కూల్స్ , ఏపి రెసిడెన్సియల్ స్కూల్స్ లో విద్యను అభ్యసించే విద్యార్థులకు విద్యా కిట్లను అందజేయడం జరిగిందన్నారు. సంకల్ప్ కార్యక్రమం ద్వారా పరీక్షల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉత్తీర్ణత శాతం మెరుగుపరచడం , విద్యార్థుల ఉత్తీర్ణత శాతంపై స్టార్ రేటింగ్ ను ప్రవేశపెట్టామని పేర్కొన్నారు. కృష్ణన్ బ్యాంకులను అధ్యయనం చేయడానికి మధ్యాహ్నం 3 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు స్టడీ అవర్స్ నిర్వహించడం జరుగుతుందన్నారు. సంకల్ప్ కార్యక్రమం పైలెట్ ప్రాజెక్టుగా నిర్వహించడం జరుగుతుందని , ఐఐటీ మద్రాస్ ప్రవర్తక్ టెక్నాలజీ ఫౌండేషన్ వారి సౌజన్యంతో మాథ్స్ , ఫిజిక్స్ , కెమిస్ట్రీ , ఇంగ్లీషు సబ్జెక్టులు బోధిస్తారన్నారు. కరికులమ్ రివిజన్ వచ్చే విద్యా సంవత్సరంలో (2025-26) అమలు చేయబడుతుందన్నారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజనం ప్రారంభించడం చాలా సంతోషంగా వుందని , ఈ కార్యక్రమానికి ప్రభుత్వం తోడ్పాటు అందిస్తున్నదని , ఇందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి గారికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు.

గుంటూరు తూర్పు నియోజకవర్గ శాసన సభ్యులు మహమ్మద్ నజీర్ అహ్మద్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే పేద వారు విద్యకు దూరం కాకూడదని విద్యా శాఖా మాత్యులు నారా లోకేష్ కళాశాలలకు అవసరమైన అన్ని మౌలిక వసతులు కల్పిస్తున్నారని తెలిపారు. ప్రతి ఒక్క విద్యార్థి ప్రభుత్వం అందించే అన్ని పథకాలను అందిపుచ్చుకుని చదువుకోవాలన్నారు. విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ తో మాట్లాడి మన బడి %-% మన భవిష్యత్తు కార్యక్రమం క్రింద కళాశాలల్లో విద్యార్థినిల టాయ్ లెట్స్ పూర్తి చేయడానికి రూ. 24,09,078 లు మంజూరు చేయించడం జరిగిందన్నారు. శనివారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం విద్యార్థులలోని పౌష్టికాహార లోపాన్ని నివారించి చురుకుగా వుండి చదువుకునేందుకు తోడ్పడుతుందన్నారు.

ఈ మధ్యాహ్న భోజనం 475 కళాశాలల్లోని 1.50 లక్షల మంది విద్యార్థులు లబ్దిపొందుతున్నారన్నారు. దీనికోసం రూ.20 కోట్ల బడ్జెట్ ను రూపొందించడం జరిగిందన్నారు. విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సులు అభ్యసించి ఉత్తీర్ణత సాధించాలన్నారు. వృత్తి విద్యా కోర్సులు చేసిన వారికి ఇంటర్మీడియట్ తరువాత ప్రభుత్వ, ప్రభుత్వేతర , ప్రైవేట్ రంగాల్లో ఉద్యోగాలు పొంది జీవితంలో స్థిరపడొచ్చన్నారు. ఇంటర్ విద్యార్థినిలకు సైకిల్ కూడా అందించే కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు.

విద్యార్థులు విదేశీ చదువులు చదువుకోవడానికి రూ. 15 లక్షలు అందివ్వడం జరుగుతుందన్నారు. మీ భవిష్యత్తు కోసం కష్టపడి చదువుకోవాలని, ఇందుకు జిల్లా కలెక్టర్ గారిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వుమెన్స్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ జ్యోత్స్న , గవర్నమెంట్ ఒకేషనల్ కళాశాల ప్రిన్సిపల్ కే. ఆనంద బాబు , డిఈఓ రేణుక , గుంటూరు తూర్పు మండల తహశీల్దార్ నగేష్ , డిఈఈఓ జే. పద్మ , యంఈఓ ఖుద్దూస్ , కార్పొరేటర్ పోతురాజు సమత , కళాశాల ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

## క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



**మంగళగిరి టౌన్,మేజర్ న్యూస్:**

క్లాప్ ఆటో డ్రైవర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సిఐటియు సీనియర్ నాయకులు జెవి రాఘవులు, వివి జవహర్ లాల్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శనివారం క్లాప్ ఆటో డ్రైవర్ల యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె శిబిరాన్ని వారు ప్రారంభించి ప్రసంగించారు. క్లాప్ ఆటో డ్రైవర్లు రెండు నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని వారు విమర్శించారు. ఈఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం అమలు చేయాలని, నెలకు వేతనం 24 వేల 500 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనేక పర్యాయములు అధికారులకు విన్నవించుకున్నప్పటికీ పట్టించుకోకపోవడంతో సమ్మెకు పోవాల్సిన పరిస్థితి వచ్చిందని వారు అన్నారు. పరిష్కరించకపోతే ఆందోళనను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికైనా అధికార యంత్రాంగం, మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ పట్టించుకోని వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆప్కాస్ లో చేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి ఎం బాలాజీ, యూనియన్ అధ్యక్షులు డి శివ, కార్యదర్శి ఎం రవి, యూనియన్ నాయకులు ఆర్ కృష్ణ, వై శివ, పి శ్రీనివాసరావు, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

## నేషనల్ స్కేటింగ్ గోల్డ్ మెడల్ విజేత హాశిష్ కు మంత్రి లోకేష్ అభినందనలు



**తాడేపల్లి,మేజర్ న్యూస్:**

తమిళనాడు పొలాచీలో డిసెంబర్ ఐదు నుంచి 15 వరకు జరిగిన 62వ నేషనల్ రోలర్ స్కేటింగ్ ఛాంపియన్షిప్- 2024 పోటీలలో బంగారు పతకం సాధించిన తాడేపల్లి డోలాస్ నగర్ కు చెందిన మెరుగుపాల హాశిష్ ను రాష్ట్ర మంత్రివర్యులు నారా లోకేష్ అభినందించారు. శనివారం ఉండవల్లిలో ప్రజా దర్బార్ కార్యక్రమంలో మంత్రి లోకేష్ ను హాశిష్ కలుసుకున్నారు. హాశిష్ భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించాలని, తన సహాయ సహకారాలు ఉంటాయని అన్నారు. క్రీడాకారుడు హాశిష్ వెంట తల్లిదండ్రులు మెరుగుపాల రాజు, శివ మాధవిలు ఉన్నారు.

## నార్నెపాడు సదస్సులో నాలుగు అర్జీల స్వీకరణ



**ముప్పాళ్ళ, మేజర్ న్యూస్ :**

మండల పరిధిలోని నార్నెపాడు గ్రామములో రెవిన్యూ సదస్సు జరిగింది. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న తహశీల్దార్ యం.భవాని శంకర్ మాట్లాడు తూ సాధ్యమైన మేరకు రెవెన్యూ సదస్సులో వచ్చిన అర్జీలను సత్వరమే పరిష్కరిస్తు న్నామన్నారు. దీర్ఘకాలికంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం ఇది మంచి వేదిక అన్నారు. ఈ సదస్సులో 4 అర్జీలు స్వీకరించామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సి.లక్ష్మీ ప్రసాద్, మండల సర్వేయర్ టీ.సుధాకర్, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు,గ్రామస్థులు పాల్గొన్నారు.

**నేడు నార్నెపాడులో**

నేడు నార్నెపాడు గ్రామములో రెవెన్యూ సదస్సు జరుగుతుందని తహసిల్దార్ తెలిపారు.

# పులి వర్సెస్ డైమండ్

(మొదటి పేజీ తరువాయి)

అప్పిరెడ్డి, చంద్రగిరి ఏసురత్నం లు చెప్పలుడిగి చూస్తుండిపో యారు. కమిషనర్ సభను బహిష్కరించి వెళ్లిపోవడంతో కమిషనర్ కు బాసటగా నగరపాలక సంస్థ ఉద్యోగులు నల్ల బ్యాగులు ధరించి కార్యాలయం ముందు ధర్నా చేశారు. అధికారులు ప్రజాప్రతిని వాగ్వాదాల మధ్య పరుష పదజాలం పెరిగిపోవడంతో లాలాపేట పోలీసులు రంగ ప్రవేశం చేసి కాపులాగా నిలబడ్డారు. పరిస్థితిని అదుపులోకి తీసుకు వచ్చేందుకు ప్రయత్నం చేశారు. ఇటువంటి ఘర్షణ నేపథ్యంలో సమావేశం కాస్త వాయిదా పడింది. లంచ్ మోసం అనంతరం సభను తిరిగి ప్రారంభిస్తామని మేయర్ చెప్పినప్పటికీ అధికారులు రాకపోవడంతో నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు మేయర్ ప్రకటించారు. ఇదిలా ఉండగా ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం జోక్యం చేసుకొని అధికారులు సభను బాయ్కాట్ చేసి వెళ్లిపోవడం సమంజసం కాదని, అధికారులు సమావేశం కొస్తే తప్పొప్పులు నిర్ణయించి ఎవరు తప్పయినా మరొకరికి అవసరమైతే సారీ చెప్పించి సభను కొనసాగించేలా చూద్దామని అధికారులకు కబురు పంపే ప్రయత్నం మేయర్ ద్వారా చేసిన రాయబారం ఫలించలేదు. అధికారులు ఎమ్మెల్సీ మాటలను పట్టించుకోలేదు. ప్రజా ప్రతినిధుల ఫోన్లకు ఆన్సర్ చేయలేదు. వివరాలకు వెళితే..

**చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధికారులు సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించారు...**

గుంటూరు నగరపాలకసంస్థ అధికారులు చిత్రవిచిత్రంగా వ్యవహరించారు. ఏకంగా కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించి సంచలనానికి తెర లేపారు. కౌన్సిల్ సమావేశం సందర్భంగా డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు అధికారులు ఏం తమాషా చేస్తున్నారా అంటూ వ్యాఖ్యానించడం వివాదానికి దారితీసింది. యావత్తు అధికార యంత్రాంగాన్ని అవమానించే విధంగా మాట్లాడారంటూ కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు. కమిషనర్ పులి శ్రీనివాసులు తోపాటు అన్ని విభాగాల అధికారులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. కౌన్సిల్ సమావేశానికి హాజరు కాలేదు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా అధికారులు సర్వసభ్య సమావేశాన్ని బహిష్కరించడం తీవ్ర చర్చనీయాంశమైంది. నగర పాలకులు కార్పొరేషన్ అధికారులు వ్యవహరించిన తీరును తీవ్రంగా పరిగణించారు. కమిషనర్ తోపాటు అధికారుల తీరును తప్పుపట్టారు. 11 లక్షల మంది జనాభా పట్ల బాధ్యతగా ఉండాల్సిన అధికారులు ఇలా వ్యవహరించడం సరైన విధానం కాదని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అయితే సాయంత్రం జరిగిన సమావేశంలో తెలుగుదేశం పార్టీ, జనసేన పార్టీ కార్పొరేటర్లు కూడా సమావేశాన్ని బహిష్కరించి వెళ్లిపోయారు. అనంతరం మేయర్ మనోహర్ నాయుడు కౌన్సిల్ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా పడింది.

## డిప్యూటీ మేయర్ వర్సెస్ నగర కమీషనర్....

గుంటూరు నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో గందరగోళం చెలరేగింది. డిప్యూటీ మేయర్ వనమా బాల వజ్ర బాబు ( డైమండ్ బాబు), నగర కమిషనర్ పులి శ్రీనివాసులు నడుమ తీవ్ర వాగ్వాదం చోటుచేసుకుంది. అధికారులు సమాధానం ఇచ్చే తీరు సక్రమంగా లేదని డిప్యూటీ మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే డైమండ్ బాబు వ్యవహరించిన తీరు సక్రమంగా లేదంటూ కమిషనర్, ఇతర అధికారులు కౌన్సిల్ సమావేశాన్ని కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు అన్న ఒక్క మాటతో వివాదం చెలరేగిన విషయం తెలిసిందే. ఎజెండాలో అధికారులు బాధ్యతాయుతంగా సమాధానం ఇవ్వలేదని డిప్యూటీ మేయర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ క్రమంలో ఆయన 'ఏం తమాషాగా' ఉందా అంటూ వ్యాఖ్యానించారు. దీంతో ఆ మాటతో కమిషనర్ అసహనం వ్యక్తం చేశారు. డైమండ్ బాబు తీరును వ్యతిరేకిస్తూ కమిషనర్, అధికారులు సైతం కౌన్సిల్ సమావేశాన్ని బహిష్కరించారు. కౌన్సిల్ సమావేశం వాయిదా పడిన అనంతరం డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు మీడియాతో మాట్లాడారు. తాను అన్న మాటపై చర్చకు సిద్ధమని ప్రకటించారు.

**డైమండ్ బాబు కమిషనర్ కి వెంటనే క్షమాపణ చెప్పాలి జీఎంసీ ఉద్యోగుల ధర్నా**

నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశంలో డిప్యూటీ మేయర్ డైమండ్ బాబు, కమీషనర్ పులి శ్రీనివాసులు నడుమ నెలకొన్న వివాదం మరింత ఉధృతమైంది. ఈమేరకు కమీషనర్ కి ఉద్యోగులు అండగా నిలిచారు. డైమండ్ బాబు కమిషనర్ కి వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నగరపాలక సంస్థలో ఉద్యోగులకు భద్రత కల్పించాలని సూచించారు. ఈమేరకు కౌన్సిల్ సమావేశం హాల్ ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.

# యువతను వ్యవసాయం వైపు ప్రోత్సహించాలి

(మొదటి పేజీ తరువాయి)

అచ్చెన్నాయుడు అన్నారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీ మరియు రైతు నేస్తం ఫౌండేషన్ల సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా "అభ్యుదయ రైతుల పురస్కారాలు%-%2025" పేరుతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి 250 మంది అభ్యుదయ రైతు దంపతులకు సన్మాన కార్యక్రమాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు వచ్చే విధంగా రైతులను ప్రభుత్వాలు ప్రోత్సహించాలన్నారు. డ్రోన్ టెక్నాలజీ అందుబాటులోకి రావడం వలన వ్యవసాయం బాగా అభివృద్ధి చెందిందని, పంటలో ఎక్కడైతే చీడపురుగులు ఉన్నాయో అక్కడే డ్రోన్ టెక్నాలజీ సహాయంతో మందులు పిచికారి చేయవచ్చన్నారు. డ్రోన్స్ అంటే ఒకప్పుడు పెళ్లిళ్ల వంటి కార్యక్రమాల్లో ఉపయోగించే వారనీ, కానీ ప్రస్తుతం వ్యవసాయంలో వీటి వినియోగం విరివిగా ఉంటున్నారు. పంటకు పట్టిన తెగులును రైతు గుర్తించి సస్యరక్షణ చర్యలు చేపట్టేలోపే జరగాల్సిన నష్టం జరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. కానీ డ్రోన్ టెక్నాలజీతో పంట తెగులును ముందుగానే గుర్తించి.. ఎక్కడ తెగులు వ్యాపించిందో అక్కడ మాత్రమే మందులను పిచికారి చేయొచ్చని వివరించారు. కాబట్టి రైతులు డ్రోన్ టెక్నాలజీని అందిపుచ్చుకోవాలని కోరారు. రైతులందరూ పంటలు పండటానికి అనువుగా భూసార పరీక్షలు చేయించిన తరువాతే పంటలు వేయాలని కోరారు. ఏపీలో శాటిలైట్, క్లౌడ్ టెక్నాలజీ వినియోగించి.. భూసార పరీక్షలకు సంబంధించిన సంపూర్ణ వివరాలను రైతులకు అందుబాటులోకి తెస్తామని హామీ ఇచ్చారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పంటలు వరదలు, తుఫాన్లను కూడా తట్టుకోగలవన్నారు. ప్రస్తుతం మార్కెట్లో సేంద్రియ ఎరువులతో పండించిన పంటలకు మంచి డిమాండ్ ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరుపున రైతులకు డ్రిప్పులు, స్ప్రింక్లర్లపై రాయితీ ఇస్తామన్నారు. ప్రస్తుత రోజుల్లో పొలంలో విత్తనం విత్తే దగ్గర నుంచి పంటను మార్కెట్లో అమ్మే వరకు కూడా రైతులకు యాంత్రీకరణ అందుబాటులోకి వచ్చిందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం యాంత్రీకరణకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, రైతులకు ఏ యంత్రం కావాలో, ఏ కంపెనీ కావాలో.. ఇలా రైతుకు కోరుకున్నదే అందిస్తుందని వెల్లడించారు. అనంతరం విజ్ఞాన్ యూనివర్సిటీపై మంత్రి అచ్చెన్నాయుడు ప్రశంసలు కురిపించారు. రైతులు, ప్రభుత్వం, విద్యార్థులు.. ఇలా అందరినీ కలుపుకొని రైతులకు సన్మానం వంటి మంచి కార్యక్రమాన్ని నిర్వహిస్తోన్న విజ్ఞాన్ యూనివర్సిటీకి ప్రభుత్వం తరపున అభినందనలు తెలిపారు. ఇలాంటి మంచి కార్యక్రమాలు మరెన్నో జరగాలి. విజ్ఞాన్ వర్సిటీలో వ్యవసాయానికి సంబంధించిన అన్ని రకాల కోర్సులతో పాటు ఫ్యాకల్టీ అందుబాటులో ఉన్నారు. విజ్ఞాన్ నుంచి మంచి మంచి ఆవిష్కరణలు, వినూత్న ఆలోచనలు బయటికి వెళ్లాలి. అందరికి మంచి జరగాలి. నూతన సాంకేతికతను అందిపుచ్చుకుని, మరెందరో రైతులకు మార్గదర్శకంగా నిలుస్తున్న అభ్యుదయ రైతులను ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రోత్సహించాలి. వారిని ప్రోత్సహిస్తే మరికొందరు రైతులు ముందుకు వస్తారు' అని పేర్కొన్నారు.

**వ్యవసాయంలో సరికొత్త టెక్నాలజీ రావాలి: విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య**

వ్యవసాయ రంగంలో సరికొత్త టెక్నాలజీ రావాల్సిన అవసరం ఉందని విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య అన్నారు. సేంద్రీయ వ్యవసాయం చేసే రైతులకు మంచి దిగుబడి వస్తుందా? ఒకవేళ దిగుబడి వచ్చినా మంచి ధర లభిస్తుందా? అని ఆయన ప్రశ్నించారు. భారీగా రసాయన ఎరువులను వినియోగించి సాగు చేయడం సాధ్యంకాదన్నారు. అయితే సేంద్రీయ వ్యవసాయాన్ని దేశంలోని అందరూ ఒకేసారి కాకుండా, మెల్ల మెల్లగా విస్తీర్ణాన్ని పెంచుకుంటుపోవాలని హితవు పలికారు. ఒక్కసారిగా సేంద్రీయ వ్యవసాయం వైపు మళ్లిన శ్రీలంక చాలా దెబ్బతిందని.. ఇలాంటి వాటి నుంచి మనం పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సేంద్రీయ వ్యవసాయంపై ప్రభుత్వం మరింత శ్రద్ధ వహించాలని కోరారు. ప్రస్తుతం రైతాంగం ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటుందని, వీటిని అధిగమించాలంటే వ్యవసాయంలో మెకనైజేషన్ పెరగాలని సూచించారు. కూలీల కొరత సమస్య పరిష్కారానికి 50 మంది చేసే పనిని.. ఒకరిద్దరు చేసేలా యాంత్రీకరణ జరగాలన్నారు. క్రమక్రమంగా రైతు పని చేసే వారి సంఖ్య తగ్గిపోతోందని, ఈ క్రమంలో కూలీల ధరలు పెరుగుతాయని చెప్పారు. దీంతో యాంత్రీకరణ పెరిగితేనే వ్యవసాయ పనులు చేయడం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఇప్పటికే కొన్ని పనుల్లో యాంత్రీకరణ చేసినప్పటికీ.. ఇంకా చేయాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు.

విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు.. ఇలా పంట చేతికొచ్చేంత వరకు అయ్యే ఖర్చు రూ.10 అయితే, పంటనూర్పిడి కోసం మాత్రమే రూ.9 ఖర్చవుతోందని వివరించారు. వ్యవసాయంలో ఏఐ, ఐవోటీ వినియోగం జరగాలన్నారు. ఉదాహరణకు ఒక మిరపతోటకు సంబంధించి అన్ని వివరాలు, తెగుళ్లకు సంబంధించిన సమాచారాన్ని రైతు తన మొబైల్లో చూసుకునే సాంకేతికత అందుబాటులోకి రావాలన్నారు. పొలంలో మొదటి మొక్కకు పురుగు పడినప్పుడే రైతుకు సాంకేతికత సాయంతో తెలియాలని, దీంతో సమగ్ర సస్యరక్షణను రైతు చేపట్టగలడని చెప్పారు. 20 ఎకరాల పొలం ఉన్నప్పటికీ రైతు పనిచేసే అబ్బాయికి పెళ్లి చేసుకునేందుకు అమ్మాయిని ఇవ్వడం లేదన్నారు. ఈ పరిస్థితులు పోవాలంటే టెక్నాలజీ సాయంతో రైతు కూడా ఒక చిరుద్యోగిలా తన పనులను హాయిగా చేసుకొనే పరిస్థితి రావాలని ఆకాంక్షించారు. అప్పుడే ఆధునీకీకరణ జరిగినట్లు అనుకోవచ్చన్నారు. ఇక ఇతర వ్యాపారాలు చేసుకునే వారి మాదిరిగా రైతులను కూడా సెల్ఫ్ ఎంప్లాయిడ్గా పరిగణించి రుణాలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వాలు రైతులకు పెట్టుబడి రుణాలు అందేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

**పంటను రెట్టింపు చేయాలి : విజ్ఞాన్స్ విద్యాసంస్థల వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు**

రైతుల సరికొత్త విధానాలు, శాస్త్రవేత్తల నూతన ఆవిష్కరణలతో పంట దిగుబడి రెట్టింపు చేసి.. నీరు, రసాయనాలను సగం చేయాలని అభ్యుదయ రైతులను వర్సిటీ వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు కోరారు. రైతు సన్మాన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'రెండు తెలుగు రాష్ట్రాల నుంచి రైతులు ఇక్కడికి వచ్చారు. ఆదర్శ రైతులను సన్మానించడంతో పాటు వారి ఐడియాలను గురించి మాట్లాడేందుకు ఇది మంచి కార్యక్రమం అన్నారు. కొత్త పద్ధతుల్లో వ్యవసాయం చేస్తున్న అభ్యుదయ రైతులు.. విద్యార్థులకు తమ ఐడియాలను వివరించవచ్చు. మిగతా వర్సిటీల కంటే విజ్ఞాన్ వర్సిటీ భిన్నమని, అగ్రికల్చర్ వైపు ఫోకస్ ఉండేలా విద్యార్థులను ఎంకరేజ్ చేస్తున్నామన్నారు. అగ్రికల్చర్ డిపార్ట్మెంట్కి సంబంధించి ప్రత్యేకంగా ల్యాబ్ ఏర్పాటు చేశామని, అలాగే దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఇక్కడ ఫ్యాకల్టీగా ఉన్నారని తెలియజేసారు. వ్యవసాయమే ఫోకస్గా మరిన్ని అప్లికేషన్స్ రావాలన్నారు.

**వ్యవసాయంలో ఆవిష్కరణలు రావాలి : రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు**

వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు రావాలని రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. వ్యవసాయానికి సంబంధించిన సమస్యలను గుర్తించి, ప్రభుత్వం లేదా సంబంధిత అధికారులతో చర్చించి రైతులకు సహాయం చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు.

కొత్త వ్యవసాయ పద్ధతులు, సాంకేతికతల గురించి ఫౌండేషన్ తరుపున రైతులకు శిక్షణ ఇస్తామని తెలియజేసారు. వ్యవసాయ రుణాలు పొందడంలో రైతులకు సహకరించడం. పంటల బీమా పథకాలు గురించి అవగాహన కల్పిస్తామన్నారు.

అనంతరం ముఖ్య అతిథులను, రైతు దంపతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ లావు రత్తయ్య, వైస్ చైర్మన్ లావు శ్రీకృష్ణదేవరాయలు, రైతునేస్తం ఫౌండేషన్ చైర్మన్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ఇంచార్జి రిజిస్ట్రార్ డాక్టర్ పీఎంవీ రావు, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, రెండు రాష్ట్రాల రైతు దంపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే జన్మదినం వేడుకలు



**పెదకాకాని,మేజర్ న్యూస్:**
చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతిని పురస్కరించుకొని అంబేద్కర్ ఇండియా మిషన్ అధ్యక్షులు పివి. సునీల్ కుమార్, ఉపాధ్యక్షులు శ్రీను, వర్కింగ్ ప్రెసిడెంట్ కె.హరికృష్ణ ఆదేశాలతో ఏఐఎం ఇన్చార్జి చక్రి బండ్లమూడి నాయకత్వంలో శనివారం మానసిక వికలాంగుల అనాధాశ్రమం నందు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐఎం గుంటూరు జోనల్ ఇన్చార్జి మధిర శేషయ్య, గొళ్ళ శ్యామ్ ముఖర్జీ, కంతేటి యలమందరావు, మండే సురేష్, బెజ్జం గోపాలకృష్ణ, బండ్లమూడి భాను,దేవరపల్లి కిరణ్, మేడిద రవి, బిళ్ళ.కిషోర్, కండెల డేవిడ్, కోలాటపు మోహన్, అమ్మిరే రమేష్, వీర్నపు వినీల్, నాగరాజు,మంచాల ఏసోబు, చప్పిడి సుబ్బారావు, ఎంజాయ్ యూత్, అంబేద్కర్ యూత్, పెదకాకాని సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### ఈనెల 10 నుంచి వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజా కార్యక్రమాలు

**మంగళగిరి,మేజర్ న్యూస్:**
వైకుంఠ ఏకాదశిని పురస్క రించుకొని మంగళగిరి -తాడే పల్లి నగరపాల సంస్థ పరిధి కొలను కొండ హరేకృష్ణ గోకుల క్షేత్రంలో ఈనెల 10, 11 తేదీల్లో రెండు రోజుల పాటు వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహిం చనున్నట్లు హరే కృష్ణ గోకుల క్షేత్రం అధ్యక్షుడు వంశీధార ధాస తెలిపారు. ఆత్మకూరులోని అక్షయపాత్ర కేంద్రీకృత వంటశాల కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరే కృష్ణ గోకుల క్షేత్రం ప్రతినిధులు పూజా కార్యక్రమాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హరే కృష్ణ గోకుల క్షేత్రం అధ్యక్షుడు వంశీధర దాస మాట్లాడుతూ మంగళగిరి -తాడేపల్లి కార్పోరేషన్ పరిధి కొలను కొండలోని జయభేరి అపార్ట్మెంట్స్ పక్కనగల హరే కృష్ణ గోకుల క్షేత్రంలో ఈనెల 10,11 తేదీలలో రెండు రోజులు పాటు వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించనునట్లు తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు వైకుంఠ ఏకాదశి పూజా కార్యక్ర మాలు జరుగుతాయని తెలిపారు. వైకుంఠ ఏకాదశి ప్రత్యేక పూజారి కార్యక్రమాల్లో భాగంగా స్వామివారి ఉత్తర ద్వార దర్శనం, లక్షార్చన , స్వామి వారి కళ్యాణం నిర్వ హించడం జరుగుతుందన్నారు. అదే విధంగా ప్రత్యేక అలంకరణలో శ్రీ రంగనాథుని దర్శనం ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో హరే కృష్ణ గోకుల క్షేత్రం ప్రతినిధులు విలాస దాస, రఘునందన్ దాస, వైకుంఠ నారాయణ దాస పాల్గొన్నారు.



## ఎస్.టీ. యూ డైరీలు, కేలండర్ల ఆవిష్కరణ



**మాచవరం, మేజర్ న్యూస్**
మాచవరం మండల రాష్ట్రోపాధ్యాయ సంఘం నూతన సంవత్సర కేలండర్లు మరియు డైరీలను మండల ద్వితీయ విద్యా శాఖాధికారి డి. శ్రీధర్ , జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యా యులు కె. ఎస్ ఎస్.సురేష్ బాబు శుక్రవారం ఆవిష్కరించారు...ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ మండలంలో విద్యాభివృద్ధి కోసం ఎస్.టీ. యూ సంఘం నిర్మాణాత్మకమైన సలహాలు సూచనలు ఇస్తూ పాఠశాలల బలోపేతం కోసం కృషి చేస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ టి యు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కూరాకుల వెంకటేశ్వర్లు, కాంద్రగుంట రాంబాబు, రాష్ట్ర కౌన్సిలర్ ఎం.వి రామిరెడ్డి, జిల్లా కౌన్సిలర్ లు వీ.ఎం.జీ.వి మూర్తి, జెల్డి విజయప్రసాద్, ఎం మరియదాసు, సఖినాల శ్రీనివాసరావు, నాయకులు జూగంటి వెంకటేశ్వరరావు, జి.రవికుమార్, ఎం.సుబ్బారావు, జి..జానీబాషా, ఆర్..అబ్రహాం, వెన్నా శ్రీనివాసరెడ్డి, మండల ఎస్ టి యు అధ్యక్షురాలు వి. జయప్రద, ఎన్. మేరి,ఇ.వి కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారంలో నూతన ఒరవడి సృష్టిస్తున్న మంత్రి లోకేష్

▸▸ 53వ రోజు ప్రజాదర్బార్ కు విన్నపాల వెల్లువ ▸▸ బాధితులకు అన్ని విధాల అండగా ఉంటామని మంత్రి భరోసా

**తాడేపల్లి,మేజర్ న్యూస్:**
ప్రజా సమస్యల పరిష్కారంలో విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ నూతన ఒరవడి సృష్టిస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా వివిధ సమస్యలతో బాధపడుతున్న వారి కోసం ప్రజాదర్బార్ నిర్వహిస్తూ బాధితులకు అండగా నిలుస్తున్నారు. ఉండవల్లిలోని నివాసంలో 53వ రోజు మంత్రి లోకేష్ ప్రజాదర్బార్ కు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తరలివచ్చారు. తాము ఎదుర్కొంటున్న సమస్యల పట్ల మంత్రి నారా లోకేష్ ను స్వయంగా కలిసి అర్జీలు ఇచ్చారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించిన మంత్రి.. బాధితులకు అన్ని విధాల అండగా ఉంటానంటూ భరోసా ఇచ్చారు. సమస్యల పరిష్కారం కోసం సిబ్బందికి అక్కడికక్కడే ఆదేశాలు జారీ చేశారు.



### రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన విజ్ఞప్తులు

– వంశధార ప్రాజెక్టు కింద కోల్పోయిన తన ఇంటికి పరిహారం అందించేలా చర్యలు తీసుకోవాలని శ్రీకాకుళం జిల్లా, హిరమండలం కొల్లివలస గ్రామానికి చెందిన భవిరి సింహాచలం మంత్రి నారా లోకేష్ ను కలిసి విజ్ఞప్తి చేశారు. ప్రాజెక్టు కింద ఇల్లు కోల్పోవడంతో ఆధారం లేక భార్య, నలుగురు పిల్లలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాను. పరిహారం అందించాలని రెవెన్యూ రికార్డుల్లో కూడా నమోదు చేశారు. అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.

- టిడ్కో ఇంటి కోసం నగదు చెల్లించినప్పటికీ అలాట్ మెంట్ అయిన ఇంటిని మంజూరు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారని విజయవాడ రాజరాజేశ్వరిపేటకు చెందిన షేక్ రేష్మా ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి ఆధారం లేని తనకు టిడ్కో ఇల్లు మంజూరు చేయాలని మంత్రి నారా లోకేష్ ను కలిసి అర్జీ ఇచ్చారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.
- పసుపు కుంకుమ కింద తనకు సంక్రమించిన భూమిని ఆన్ లైన్ లో నమోదు చేయడంతో పాటు పట్టాదారు పాసుపుస్తకం మంజూరు చేయాలని ప్రకాశం జిల్లా చంద్రశేఖరాపురం మండలం, మిట్టపాలెం గ్రామానికి చెందిన కొమ్మినేని చిన్న వెంకటరమణమ్మ విజ్ఞప్తి చేశారు. నా తల్లిదండ్రులు పసుపు కుంకుమ కింద 3.27 ఎకరాలను స్థిరాస్తి సెటిల్ మెంట్ స్వాధీన అగ్రిమెంట్ ద్వారా రాయించి ఇచ్చారు. వృద్ధాప్యంతో నా తల్లిదండ్రులు చనిపోయారు. సదరు భూమి నాకు సంక్రమించినప్పటికీ ఆన్ లైన్ లో వారి పేరు మీదనే ఉండటంతో ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, సబ్సిడీలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు తగిన న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.
- తమ గ్రామంలో గత ఎనిమిదేళ్లుగా నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని ప్రకాశం జిల్లా దర్శి మండలం తూర్పు వెంకటాపురానికి చెందిన జంపాల రామారావు మంత్రి నారా లోకేష్ ను కలిసి అర్జీ ఇచ్చారు. ఇంటింటికీ కుళాయి ద్వారా తాగునీరు అందించే జలజీవన్ మిషన్ కింద పనులు ప్రారంభించినప్పటికీ నత్తనడకన సాగుతున్నాయని మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. గ్రామ శివారులోని పెదవాగు మీద ఉన్న ఆర్ అండ్ బి బ్రిడ్జ్ ను కూడా విస్తరించాలని కోరారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి భరోసా ఇచ్చారు.
- నెల్లూరు జిల్లా ముత్తుకూరులోని తన 28 అంకణాల స్థలాన్ని నెల్లూరు జిల్లా వాసి ఆరుగుంట శ్రీనివాసులురెడ్డి కబ్జా చేశారని, విచారించి తగిన న్యాయం చేయాలని పున్నూరు రాఘవయ్య మంత్రి నారా లోకేష్ ను కలిసి కన్నీటిపర్యంతం అయ్యారు. 1994లో ఎమ్మార్వో కార్యాలయం ఎదురుగా ఉన్న స్థలాన్ని కొనుగోలు చేశాను. నా స్థలం పక్కనే వినుకోటి సుబ్బారాయుడు స్థలం ఉంది. అతడు తన స్థలంతో పాటు నా స్థలాన్ని కూడా ఆరుగుంట శ్రీనివాసులురెడ్డికి విక్రయించాడు. నా స్థలంలోకి దౌర్జన్యంగా ప్రవేశించి ప్రహరీ గోడ కూడా నిర్మించారు. పోలీసులకు ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకోలేదని రాఘవయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు.పెన్షన్ అందించడంతో పాటు తమ సమస్యలు పరిష్కరించాలని దివ్యాంగులు, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వైద్య సాయం అందించాలని పలువురు మంత్రి నారా లోకేష్ ను కలిసి విన్నవించారు. పరిశీలించి అండగా ఉంటామని మంత్రి భరోసా ఇచ్చారు.

## సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

**దుగ్గిరాల, మేజర్ న్యూస్**
.దుగ్గిరాల మండల పరిధిలోని కంఠం రాజు రాజు కొండూరు నుంచి చిలువూరు గ్రామం వరకు నూతనంగా ఒక కోటి 75 లక్షల రూపాయలతో నిర్మించే సీసీ రోడ్డు నిర్మాణానికి శనివారం శంకుస్థాపన చేశారు. నాబార్డ్ నిధులతో చేపట్టనున్న మూడు కిలోమీటర్ల మేర ఈ రోడ్డు నిర్మాణం జరుగునున్నది .ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దుగ్గిరాల ఎంపీపీ షేక్ జబీన్ హాజరు. కా గా అర్చకులు మణిశర్మ వేదమంత్రాలు నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించి భూమి పూజ కార్యక్రమాన్ని చేపట్టారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చిలువూరు మాణిక్యం, ఎంపిటిసి సభ్యులు. చి లువూరు మరియ రోజమ్మ పార్టీ నాయకులు తోటకూర సీతారామయ్య ,మల్లెంపాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ శేషగిరి ,పంచాయతీ కార్యదర్శి శరత్ ,వీరయ్య తదితరులు పాల్గొన్నారు.



## అంగన్ వాడీ కేంద్రాల్లో ఈసీసీఈ డే కార్యక్రమాలు

**మంగళగిరి టౌన్, మేజర్ న్యూస్:**
మంగళగిరి -తాడేపల్లి కార్పోరేషన్ పరిధి యర్రబాలెం లోని అంగన్ వాడీ కేంద్రాల్లో శనివారం ఈసీసీఈ డే కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా అంగన్వాడి కేంద్రాల్లో చదువుతున్న చిన్నారుల చేత సృజనాత్మకత అంశాలకు సంబంధించిన కార్యక్రమాలు ప్రదర్శింప జేశారు. అంకెలతో ఆటలు, అంకెలతో కూడిన అభినయ గేయాలతో పాటు మార్కెట్ కు వెళ్లి కూరగాయలు కొనుగోలు, అమ్మకాలు చేస్తున్నట్లు చిన్నారుల చేత వారి వారి తల్లిదండ్రుల సమక్షంలో రోల్ ప్లే చేయించారు. ఈ సమావేశంలో ఏఎన్ఎంలు, ఎంఎస్ కేలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

